సాక్షి ఖమ్మం

సోమవారం ; 25 ; ఆగస్టు ; 2025



కేఎంసీలో ఆడిట్ పొడిగింపు

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అకౌంట్స్ జనరల్ ఆడిట్‌ను మరో మూడు రోజులు పొడిగించినట్లు తెలిసింది. 8లో



ఐటీఐతో ఉపాధి అవకాశాలు

ఐటీఐ కోర్సులతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులు, ఐటీఐ కళాశాల బాధ్యులు కృషి చేస్తున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 33° / 24°

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత ఎక్కువగానే ఉంటుంది. సాయంత్రం తర్వాత కొన్ని చోట్ల ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుడికి బంగారు నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న మురళీకృష్ణ

ఖమ్మం సహకారనగర్ : ముదిగొండ జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు అవధానుల మురళీకృష్ణకు జాతీయస్థాయిలో బంగారు నంది అవార్డు లభించింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన కీర్తి ఆర్ట్ అకాడమీ వారు.. వివిధ రంగాల్లో పని చేస్తున్న వారి నుంచి అవార్డుల కోసం నామినేషన్లు స్వీకరించారు. అందులో విద్యా విభాగం నుంచి తనకు అవార్డు లభించినట్లు తెలిపారు. కాగా, ఈ అవార్డును కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాల చారి, ఆధ్యాత్మికవేత్త దైవజ్ఞ శర్మ, అకాడమీ అధినేతల చేతులమీదుగా అందుకున్నానని చెప్పారు.

విద్యుత్ సేఫ్టీ అధికారుల నియామకం

ఖమ్మంవ్యవసాయం : విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు గాను సేఫ్టీ అధికారులను నియమిస్తున్నట్లు విద్యుత్ సర్కిల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలో పనిచేసే టెక్నికల్ డీఈలను సేఫ్టీ అధికారులగా నియమించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు, ముఖ్యంగా రైతుల్లో విద్యుత్‌పై అవగాహన పెంచడమే లక్ష్యంగా చైతన్య కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రైతుల కోసం చేపట్టిన పొలం బాట కార్యక్రమంలో ఇప్పటివరకు 2,197 లూజ్‌లైన్లను పునరుద్ధరించామని, 1,510 స్తంభాలను సరి చేశామని, 2,296 అదనపు స్తంభాలను ఏర్పాటు చేశామని వివరించారు. విద్యుత్ సమస్యలు గుర్తిస్తే వినియోగదారులు, ప్రజలు 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

పదోన్నతుల జాబితా సిద్ధం

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలో ఎస్‌జీటీల నుంచి ఎస్ఏ(స్కూల్ అసిస్టెంట్లు)లుగా పదోన్నతి పొందే వారి జాబితాను విద్యాశాఖ సిద్ధం చేసింది. ఈ మేరకు జిల్లాలో 1: 3 నిష్పత్తిలో సుమారు 600 మంది ఎస్‌జీటీలు ఉండగా 1:1 నిష్పత్తిలో వివిధ సబ్జెక్ట్‌లకు సంబంధించి 207 మందితో తుది జాబితా తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. కాగా సోమవారం ఉదయం ఈ 207 మందికి వెబ్ ఆప్షన్లు మొదలయ్యే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

ఈవీ.. రయ్ రయ్!



పర్యావరణానికి హితం..

ఎలక్ట్రిక్ వాహనాలు బ్యాటరీల ద్వారా విద్యుత్‌శక్తితో నడుస్తాయి. వీటికి ఇంజన్లు ఉండవు. దీంతో వాయుకాలుష్యం చాలా తక్కువ. పర్యావరణ హితంగా ఉంటాయి. వీటిలో ఎటువంటి కాలుష్యాన్ని ఉత్పత్తి చేయని మోటార్ ఉంటుంది. ప్రస్తుత కాలంలో వాయుకాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. ఈ క్రమంలో ఎలక్ట్రిక్ వాహనాలు పెరగడం ద్వారా వాతావరణ కాలుష్యం నివారించేందుకు వీలవుతుంది. ఇక వాహనాల నుంచి అతి తక్కువ శబ్దం రావడంతో పాటు ప్రయాణం చాలా మృదువుగా సాగుతుంది.

చార్జింగ్ స్టేషన్ల కొరత..

ఈ వాహనాలను చార్జింగ్ చేసేందుకు స్టేషన్ల కొరత ఉంది. రాష్ట్రంలో అతి తక్కువ ప్రాంతాల్లోనే చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇక జిల్లాలో ఈ చార్జింగ్ స్టేషన్లు అసలే లేవు. దీంతో వాహనాలను కొనుగోలు చేసిన వారు ఇంటివద్దే చార్జింగ్ పెట్టుకోవాల్సి వస్తోంది. మధ్య మధ్య చార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో ఎక్కువ దూరం ఈ వాహనాలపై ప్రయాణించలేకపోతున్నారు. అయితే రానున్న కాలంలో పలు ప్రాంతాల్లో స్టేషన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వాహనాల సంఖ్య పెరిగితే చార్జింగ్ స్టేషన్లు కూడా అనివార్యంగా రానున్నాయి. స్టేషన్లు ఏర్పాటు చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ చార్జింగ్ అయ్యే అవకాశం ఉంటుంది. ఇంట్లో వాహనాలకు చార్జింగ్ పెట్టాలంటే ఎక్కువ సమయం పడుతోందని యజమానులు చెబుతున్నారు.

జిల్లాలో పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాలు

- టూ వీలర్ నుంచి పెద్ద వాహనాల వరకు..
- 11 ఏళ్లలో నాలుగు వేల వెహికిల్స్
- పర్యావరణ హితం కావడంతో సర్కారు ప్రోత్సాహం
- చార్జింగ్ స్టేషన్లు ఉంటే మరింతగా పెరగనున్న వాహనాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇటీవలి కాలంలో వీటి ప్రయోజనాలు తెలుసుకునేందుకు వాహనదారులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. గతంలో పలు కారణాలతో ఈ వాహనాల కొనుగోళ్లు ఆశాజనకంగా లేవు. అయితే క్రమంగా సంప్రదాయ వాహనాలతోపాటు వీటికి కూడా డిమాండ్ ఏర్పడుతోంది. జిల్లాలో ప్రస్తుతం అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలు కలిపి 4,044 ఉన్నాయి. వీటిలో టూ వీలర్ల నుంచి పెద్ద వాహనాల వరకు ఉన్నాయి. ప్రధానంగా ఈ వాహనాలతో పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. అయితే చార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో ఇబ్బంది అవుతోందని వినియోగదారులు అంటున్నారు. ఈ స్టేషన్లు ఏర్పాటైతే ఎలక్ట్రికల్ వాహనాల మార్కెట్ మరింతగా పెరిగే అవకాశం ఉంది.

ఈ వాహనాలకు రాయితీ..

ఎలక్ట్రికల్ వాహనాల్లో పలు రకాలున్నాయి. బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు బ్యాటరీతో మాత్రమే పనిచేస్తాయి. హైబ్రీడ్ ఎలక్ట్రిక్ వాహనాలకు పెట్రోల్ ఇంజన్, బ్యాటరీ రెండూ ఉంటాయి. ప్లగ్ ఇన్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాలు ప్లగ్ ఇన్ ద్వారా చార్జ్ చేయగల బ్యాటరీలను కలిగి ఉంటాయి. సంప్రదాయ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రికల్ వాహనాల ధర ఎక్కువగానే ఉంది. అయితే ఈ వాహనాలు కొనుగోలు చేస్తున్న వారికి రవాణా శాఖ పలు రాయితీలు కల్పిస్తోంది. వీటికి లైఫ్ ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. అలాగే రిజిస్ట్రేషన్ ఫీజు కూడా లేదు.

జిల్లాలో 4,044 వాహనాలు..

జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య గతంతో పోలిస్తే భారీగా పెరిగింది. ఒకప్పుడు ఈ వాహనాల కొనుగోలుకు అనేక అనుమానాలు వ్యక్తం చేసిన ప్రజలు.. ప్రస్తుతం కొంత ఆసక్తి చూపుతున్నారు. రవాణా శాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వివరాల ప్రకారం.. జిల్లాలో హెవీ, మీడియం, లైట్ ఎలక్ట్రికల్ వెహికిల్స్ మూడు ఉన్నాయి. ఇక త్రీ వీలర్ గూడ్స్ వాహనాలు 22 ఉన్నాయి. మోటారు సైకిళ్లు, స్కూటర్లు 3,731 ఉన్నాయి. టీజీఎస్ ఆర్టీసీ పలు జిల్లాల్లో ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశపెట్టింది. అయితే చార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో ఇంకా ఖమ్మం రీజియన్‌కు ఈ బస్సులు రాలేదు. ఇక జిల్లాలో సంప్రదాయ వాహనాలు 6,35,951 ఉన్నాయి. ఇందులో అధికంగా మోటారు సైకిళ్లు 4,60,476 ఉన్నాయి. అలాగే కార్లు 46,143 ఉన్నాయి. ఆటోలు 32,672 ఉన్నాయి.

జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల వివరాలు..

వాహనం పేరు	సంఖ్య
హెవీ,మీడియం,లైట్ వెహికిళ్లు	03
త్రీవీలర్ గూడ్స్	22
ట్యాక్సీ క్యాబ్	01
ఆటోలు	142
ప్రైవేట్ సర్వీస్ వాహనాలు	08
మోటారు సైకిళ్లు, స్కూటర్లు	3,731
ఎలక్ట్రిక్ కార్లు	137
మొత్తం	4,044

పేదల సంక్షేమమే లక్ష్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల తదితరులు

- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి

ఖమ్మం అర్బన్ : పేదల అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం నగరంలోని 57వ డివిజన్ రమణగుట్ట ప్రాంతంలో రూ.2.36 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 57వ డివిజన్‌లో పేదలు అధికంగా ఉన్నందున ఎక్కువ నిధులు కేటాయించామని తెలిపారు. నగరానికి రెండు వేల ఇళ్లు మంజూరు చేస్తే అందులో 200పైగా ఈ డివిజన్‌కే అందించామని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు నాణ్యతతో ఉండాలని, పాఠశాల నిర్మాణ ప్రతిపాదనలు త్వరలో ఆమోదం పొందుతాయని చెప్పారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ 57వ డివిజన్‌లో 230 మందికి ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. నగర పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ఆర్డీఓ నరసింహారావు, మున్సిపల్ ఈఈ వి.రంజిత్, అర్బన్ తహసీల్దార్ సైదులు, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మహ్మద్ రఫీదా బేగం, మలీదు వెంకటేశ్వర్లు, నాయకులు ఎండీ ముస్తఫా, మిక్కిలినేని నరేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, దొబ్బల సౌజన్య, రావూరి సైదబాబు, పైడుపల్లి సత్యనారాయణ, దీపక్‌చౌదరి, సాధు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలికల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

ఉమ్మడి జిల్లా గురుకులాల ఆర్‌సీఓ అరుణకుమారి



బాలికకు సర్టిఫికెట్ అందిస్తున్న అరుణకుమారి

కొణిజర్ల: బాలికలను అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్ది, వారి సర్వతోముఖాభివృద్ధికి అధ్యాపకులు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్(ఆర్‌సీఓ) అరుణకుమారి అన్నారు. మండలంలోని తనికెళ్ల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఆదివారం డిగ్రీ ప్రథమ సంవత్సర బాలికలకు స్వాగత వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అరుణకుమారి మాట్లాడుతూ.. విద్యార్థినులు చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో పట్టు సాధించాలని సూచించారు. బాలికల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెడుతోందని, గురుకులాల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాగా చదవాలని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. అనంతరం బాలికల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ కె. రజని అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, వివిధ విభాగాల కోఆర్డినేటర్లు కె.పి. ఐశ్వర్య, ఎ.దీప్తి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ కె.రజిత తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్ర కూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పన్నుల ఎగవేతకు అడ్డదారులు

- నకిలీ పర్మిట్లతో పంటల ఎగుమతి
- లైసెన్సులు మార్చి కొనుగోళ్లు..
- ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో గండి
- రాజకీయ పలుకుబడితో అక్రమ దందా



ఖమ్మం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పత్తి(ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు, ఎగుమతుల్లో వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. సర్కారుకు చెల్లించే పన్నుల ఎగవేతకు అక్రమ మార్గాలు అనుసరిస్తున్నారు. రైతుల నుంచి పంట కొనుగోళ్ల మొదలు ఇతర రాష్ట్రాలు, దేశాలకు జరిగే ఎగుమతుల వరకు ఈ దందా సాగుతోంది. కొందరు వ్యాపారులు నకిలీ ఎగుమతి పర్మిట్లు సృష్టించి వివిధ పంటలను ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ప్రధానంగా దేశీయంగా జరిగే పంటల రవాణాలో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. తద్వారా రూ.కోట్లలో పన్ను చెల్లింపులకు ఎగనామం పెడుతున్నారు. ఈ ఘటన ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలో వెలుగుచూసింది.

బిల్లుల్లో తేడాతో..

ఖమ్మంలోని ఎంకే ట్రేడర్స్ పేరుతో పంటలు కొనుగోలు చేసే మన్నం కృష్ణయ్య అనే వ్యాపారి 2023 నవంబర్‌లో నకిలీ ఎక్స్‌పోర్ట్ పర్మిట్లతో రూ.కోటి విలువైన 1,393 పత్తి బస్తాలు ఏపీలోని ఎమ్మిగనూరు మార్కెట్ పరిధిలోని ఓ సంస్థకు తరలించాడు. సంస్థ ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రయత్నించగా బిల్లులు ట్యాలీ కాకపోవడంతో అనుమానం వచ్చిన అధికారులు పర్మిట్లు పరిశీలించారు. దీంతో ఐదు లారీల్లో నకిలీ పర్మిట్లతో పత్తి రవాణా జరిగినట్లు గుర్తించారు. నకిలీ పర్మిట్లు ఖమ్మం మార్కెట్ నుంచి జారీ చేసినట్లు ఉండడంతో సదరు అధికారులు ఇక్కడికి వచ్చి పర్మిట్లను తనిఖీ చేయగా నకిలీవని బయటపడింది. వెంటనే కృష్ణయ్యపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. ఈ ఒక్క ఘటనలోనే సదరు వ్యాపారి మార్కెట్ ఫీజు(సెస్) రూ.లక్ష ఎగవేతకు పాల్పడగా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన జీఎస్టీకి కూడా మంగళం పాడే అవకాశం ఉంది. ఇలాంటి దందా జిల్లాలోని పలువురు వ్యాపారులు సాగిస్తున్నట్లు సమాచారం.

లైసెన్సులు మార్చి కొనుగోళ్లు..

పన్నుల కాలయాపన, ఎగవేతకు కొందరు వ్యాపారులు లైసెన్సులు మార్చి పంటలు కొనుగోలు చేస్తున్నారు. కుటుంబ సభ్యుల పేరిట మూడు, నాలుగు లైసెన్సులు తీసుకుంటూ వాటిలో ఒక లైసెన్స్‌తో రూ. కోట్ల విలువైన పంటలు కొనుగోలు చేసి ఎగుమతి చేస్తారు. వాటికి సంబంధించిన పన్నులు చెల్లించకుండా బకాయి పెడతారు. అధికారుల నుంచి నోటీసులు వస్తే మరో లైసెన్స్‌తో వ్యాపారంలోకి దిగుతారు. ఇలా కొందరు వ్యాపారులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రూ. లక్షల్లో ఫీజులు, జీఎస్టీలు బకాయి పడి ఉన్నారు. జిల్లాలో సమృద్ధిగా పంటలు పండుతున్నా మార్కెట్లకు ఏటా రూ. 63కోట్లు మాత్రమే పన్నులు వసూలవుతున్నాయి. రాష్ట్రంలో పెద్ద మార్కెట్లలో ఒకటైన ఖమ్మంలో ప్రధానంగా పత్తి, మిర్చి క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. వీటిలో మిర్చి విదేశీ ఎగుమతులు కూడా ఉంటాయి. దీంతో మార్కెట్ 1 శాతం పన్ను రూ. 30 కోట్లు ఉంటుంది. పంటల ధరలను వ్యాపారులు స్పష్టంగా బిల్లుల్లో పేర్కొంటే పన్నులు మరో రెండు రెట్లు పెరిగి రూ. 90 కోట్లకు చేరే అవకాశం ఉంది. అయితే కొందరు వ్యాపారులు పారదర్శకత పాటించకుండా మార్కెట్ పన్నుల్లో కోత విధిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 225 మంది ఖరీదుదారులు ఉండగా వీరిలో 150 మంది వివిధ పంటలు కొనుగోలు చేసి దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ఇందులో 10, 15 మంది వ్యాపారులు రూ.1.50 కోట్ల మేర పన్నులు బకాయి ఉన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు చూస్తే మొత్తంగా రూ. 2.50 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి.

రాజకీయ అండతోనే..

వ్యాపారులు వివిధ పార్టీల్లో నాయకులుగా, కార్యకర్తలుగా చెలామణి అవుతున్నారు. ఉన్నత పదువుల్లో ఉన్న వారి వెంట తిరుగుతూ.. వారి మనుషులమని చెప్పుకుంటూ తప్పుడు విధానాలకు పాల్పడుతున్నారు. తద్వారా సర్కారుకు చెల్లించాల్సిన పన్నులకే గండి కొడుతున్నారు. అధికారులు కూడా వారిని ప్రశ్నించాలన్నా, నోటీసులు జారీ చేయాలన్నా ఇబ్బంది పడుతున్నారు. వారి దందాను అడ్డుకునే ప్రయత్నం చేస్తే అధికారులపైనే నింద మోపుతూ ఇరకాటంలో పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చట్టపరంగా వసూలు చేస్తాం

పంటల కొనుగోళ్లకు సంబంధించి మార్కెట్‌కు వ్యాపారులు చెల్లించాల్సిన 1 శాతం పన్ను చట్ట ప్రకారం, నిబంధనలు పాటిస్తూ వసూలు చేస్తాం. పాత బకాయిలపై దృష్టి సారించాం. నకిలీ ఎక్స్‌పోర్ట్ పర్మిట్లతో పంట ఎగుమతి జరిగినట్లు గుర్తించి ఓ ట్రేడింగ్ కంపెనీపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. అక్రమాలకు పాల్పడే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

– పి ప్రవీణ్‌కుమార్, ఖమ్మం మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి

ఆరోగ్యశ్రీ.. భారీ బాకీ

- జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.50 కోట్లకు పైగానే..
- ప్రభుత్వ ఆస్పత్రులకూ అందని నిధులు
- 31 నుంచి ఆరోగ్యశ్రీ సేవల బంద్‌కు పిలుపు



ఖమ్మంవైద్యవిభాగం: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకం రెండు అడుగులు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కు అన్నచందంగా తయారైంది. ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని సక్రమంగా నిర్వహించకపోవడంతో లబ్ధిదారులు వినియోగించుకోలేకపోతున్నారు. జిల్లాలో ఈ పథకం పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండగా.. గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆయా ఆస్పత్రులకు నిధులు విడుదల కావడం లేదు. దీంతో భారీగా చెల్లింపులు నిలిచిపోవడంతో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయాలని నిర్ణయించారు. అదే విధంగా ప్రభుత్వ ఆస్పత్రులకూ నిధులు రాకపోవడంతో పేషంట్లకు అందించాల్సిన సేవలపై ఆ ప్రభావం పడుతోంది. ఆయా నిధులు అందితే ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధితో పాటు రోగులకు సదుపాయాలు కల్పించే ఆస్కారం లభిస్తుంది.

పరిమితి పెంపు.. చెల్లింపులు నిల్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి ఉచితంగా వైద్య సేవలు అందించేలా ఆరోగ్యశ్రీ సేవలను 2008లో అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాలో మొత్తం 7,12, 461 రేషన్ కార్డులు ఉండగా.. వీరందరూ ఈ పథకానికి అర్హులు. గతంలో రేషన్‌కార్డు కలిగిన కుటుంబసభ్యులకు రూ.5లక్షలలోపు వైద్యం పొందే అవకాశం ఉండేది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఆ మొత్తాన్ని రూ.10లక్షలకు పెంచింది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 1,835 రకాల వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నారు. అయితే ఏడాదికి పైగా ప్రైవేటు(నెట్‌వర్క్) ఆస్పత్రులకు చెల్లింపులు జరగట్లేదు. ఆందోళన బాట పట్టినప్పుడు కంటి తుడుపుగా కొంత చెల్లించడం, ఆతర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. ఏడాదికి పైగా సర్జరీలకు సంబంధించి బకాయిలు పేరుకుపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా మారిందని, సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేకపోతున్నామని చెబుతున్నారు. దీంతో ఈనెల 31వ తేదీ అర్ధరాత్రి నుంచి ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. ఖమ్మం జిల్లాలో ఆరోగ్యశ్రీ బకాయిలు రూ. 50 కోట్లకు పైగా ఉంటాయని ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి.

జిల్లాలో 31 ఆస్పత్రులు..

బకాయిలు చెల్లించాలని, ప్యాకేజీలు పునర్‌సమీక్షించాలనే డిమాండ్‌తో నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ పిలుపునిచ్చింది. డిమాండ్లు పరిష్కరించకపోతే ఈనెల 31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయాలని నిర్ణయించింది. ఖమ్మం జిల్లాలో 31 ప్రైవేటు(నెట్‌వర్క్) ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలకు అనుమతి ఉంది. భారీగా బకాయిలు పేరుకుపోవడంతో ఆరోగ్యశ్రీ పథకంతో పాటు ఉద్యోగుల ఆరోగ్య పథకం, జర్నలిస్ట్ ఆరోగ్య పథకం కింద సేవలు బంద్ కానున్నాయి. జిల్లాలో రూ. 50 కోట్లకు పైగా బకాయిలు ఉండడంతో నిర్వహణ తమ వల్ల కావట్లేదని, ప్రభుత్వం క్రమంతప్పకుండా బకాయిలు చెల్లించాలని, ప్యాకేజీ ధరలను పెంచాలని యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. అలాగే జిల్లాలో 8 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందిస్తుండగా.. అందులో ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ సేవలు అందుతాయి. మొత్తం 8 ఆస్పత్రులకు కలిపి రూ. 5.5 కోట్ల చెల్లింపులు రావాల్సి ఉండగా.. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి రూ. 5 కోట్లు ఇవ్వాల్సి ఉంది. అయితే ఖమ్మం ఆస్పత్రిలో కార్యాలయ నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒక్కోసారి ఆరోగ్యశ్రీ రోగులకు మందులు ప్రైవేట్ నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది. పెండింగ్ ఆరోగ్యశ్రీ నిధులు అయినా విడుదలైతే ఆస్పత్రి నిర్వహణ అయినా సక్రమంగా జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

14 నెలలుగా బకాయి...



ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు 14 నెలల బిల్లు బకాయి ఉంది. తద్వారా మందులు, నిర్వహణ ఖర్చులకు అప్పు చేయాల్సి వస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిమితిని రూ.10 లక్షలకు పెంచినా బిల్లులు మాత్రం చెల్లించట్లేదు. ఆస్పత్రులు నడిచే పరిస్థితి లేక ఈనెల 31నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేయాలని నిర్ణయించాం. ప్రజలను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం లేకున్నా ఇతర గత్యంతరం లేదు.

– డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, శ్రీరక్ష ఆస్పత్రి

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ ?

నేలకొండపల్లి : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా మండపాలకు అనుమతి పొందిన వారి వివరాలను సేకరిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు ఉచితంగా విద్యుత్ వినియోగించుకునేందుకు వివరాలు సమర్పించాలని నిర్వాహకులను కోరినట్లు తెలిసింది. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 5 వేలకు పైగా మండపాలకు అనుమతులు పొందారు. తొమ్మిది రోజుల పాటు జరిగిన వేడుకలకు దాదాపు 2.50లక్షల యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించారని అధికారులు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో వార్డుల వారీగా మండపాల వివరాలు సేకరిస్తున్నారు. అయితే ప్రభుత్వ అనుమతి పొందిన వాటికి మాత్రమే ఉచిత విద్యుత్ అందించేందుకు ఆ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాగా గతేడాది కంటే ఈ ఏడాది మండపాలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీల నాయకులు విగ్రహాలు ఇప్పించేందుకు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో మండపాలు భారీగా పెరగనున్నట్లు సమాచారం. మండపాలకు ఉచిత విద్యుత్‌పై ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసాచారిని వివరణ కోరగా.. అధికారికంగా ఆదేశాలు రావాల్సి ఉందని తెలిపారు.

క్లుప్తంగా

నిజాయితీ చాటిన ఆర్టీసీ డ్రైవర్



ప్రయాణికుడుకి నగదును అందజేస్తున్న రాంబాబు

సత్తుపల్లిటౌన్: బస్సులో ప్రయాణికుడు మర్చిపోయిన రూ.లక్ష నగదు ఉన్న బ్యాగ్‌ను తిరిగి అప్పగించి సత్తుపల్లి ఆర్టీసీ డిపో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. డిపోకు చెందిన డ్రైవర్ బి.రాంబాబు ఆదివారం ఎంజీబీఎస్ నుంచి టీఎస్ 04జెడ్0278 సూపర్‌లగ్జరీ బస్సు నడుపుతున్నాడు. గద్వాల్ జిల్లా ధర్రూర్ గ్రామానికి చెందిన నర్సింహ సత్తుపల్లికి ప్రయాణిస్తున్నాడు. సూర్యాపేట బస్టాండ్‌లో భోజనానికి ఆగిన సమయంలో తన వద్ద రూ.లక్ష నగదుతో ఉన్న బ్యాగ్‌ను మర్చిపోయి దిగాడు. బస్సు తిరిగి ఎక్కలేకపోయిన నర్సింహ.. డ్రైవర్ రాంబాబుకు సమాచారం అందించగా బస్సులో ఉన్న బ్యాగును గుర్తించి సత్తుపల్లికి చేరుకున్నాడు. వెనుక మరో బస్సులో నర్సింహ సత్తుపల్లికి రాగా.. ఎస్ఎం ఆనందం, ఏడీసీ పి.అప్పారావు, సెక్యూరిటీ కానిస్టేబుల్ నరేశ్ సమక్షంలో ఆధార్‌కార్డు ఆధారంగా ప్రయాణికుడికి తిరిగి నగదును అప్పగించారు. ఆర్టీసీ డ్రైవర్ రాంబాబును డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి అభినందించారు.

సొంత ఖర్చులతో రోడ్లకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న కండక్టర్ గౌస్‌పాషా

ఖమ్మంమయూరిసెంటర్: ఆయన ఆర్టీసీ కండక్టర్. ప్రవృత్తి మాత్రం సమాజ సేవ. ఖమ్మం నగరానికి చెందిన ఎండీ గౌస్‌పాషా ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. కొన్నేళ్లుగా నగరంలో మొక్కలు నాటడం, రోడ్లకు మరమ్మతులు చేయడం, పర్యావరణంపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద సిగ్నల్ పాయింట్ రోడ్డు దెబ్బతినడంతో ఆదివారం గౌస్‌పాషా సొంత ఖర్చులతో మరమ్మతులు చేశారు. సిమెంట్, కంకర, ఇసుక మిక్చర్‌ను తీసుకొచ్చి గుంతలను పూడ్చారు. అలాగే, పలు మార్గాల్లోని రోడ్లకు మరమ్మతులు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడు వద్ద గల ఓ వెంచర్‌లో గడ్డిమందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కూసుమంచి మండలం జీళ్లచెర్వుకు చెందిన అంబాల భాస్కర్ (28) డిగ్రీ వరకు చదువుకున్నాడు. కొంతకాలం ఖమ్మంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేశాడు. ఆ ఉద్యోగం మానేసి ప్రస్తుతం వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఈ నెల 14న వెంచర్‌లో గడ్డిమందు తాగాడు. విషయం తెలుసుకున్న బంధువులు ఆయన్ను ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి బక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

ఐటీఐతో ఉపాధి అవకాశాలు

- విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా మార్పులు
- నకల సౌకర్యాలతో సిద్ధమైన ఖమ్మం ఐటీఐ
- ఈనెల 28వరకు ప్రవేశాలకు కౌన్సెలింగ్



కళాశాలలో బోధనకు సమకూర్చిన పరికరాలు



ఐటీఐ ప్రాంగణం, (ఇన్‌సెట్) ఐటీఐ కళాశాల ముఖద్వారం

ఖమ్మం సహకారనగర్: ఐటీఐ కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయనే విశ్వాసాన్ని విద్యార్థుల్లో కల్పించేలా ప్రభుత్వం, అధికారులు, ఐటీఐ కళాశాల బాధ్యులు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో 65 ప్రభుత్వ ఐటీఐ కళాశాలలుండగా... గత ఏడాది వీటిని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు (ఏటీసీ)గా మార్పు చేయాలని నిర్ణయించారు. తొలి దశలో రాష్ట్రంలోని మూడు కళాశాలలను మోడల్ ఏటీసీగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఈ జాబితాలో ఖమ్మంలోని టేకులపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఉంది. ఇక నూతనంగా ప్రభుత్వం తెలంగాణ గేట్ ఫర్ అడాప్టింగ్ అండ్ ట్రైనింగ్ ఎంప్లాయ్‌మెంట్ (టీ–గేట్) విధానాన్ని ప్రవేశపెట్టింది. టీ–గేట్‌తో ఐటీఐ (ఏటీసీ)లో ప్రాంగణ నియామకాలు పెంచి విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా కృషి చేయనున్నారు.

టీ–గేట్‌తో ఉపాధి..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ–గేట్‌తో ఐటీఐ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభించనున్నాయి. తెలంగాణ గేట్ ఫర్ అడాప్టింగ్ అండ్ ట్రైనింగ్ ఎంప్లాయ్‌మెంట్ (టీ–గేట్) పథకం ద్వారా జిల్లాలోని పరిశ్రమల్లో విద్యార్థులకు ఉద్యోగ కల్పన చేపట్టనున్నారు. ఇందుకోసం ప్రధాన పరిశ్రమ లేదా సంస్థ డైరెక్టర్, సీఎండీ స్థాయి అధికారి కమిటీ చైర్మన్‌గా, కార్మిక విభాగం అధికారి వైస్ చైర్మన్‌గా, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కన్వీనర్‌గా ఉంటారు. ఈ కమిటీ జిల్లాలోని పరిశ్రమల్లో ఉన్న ఖాళీలను గుర్తించి.. ఐటీఐ విద్యార్థులతో భర్తీ చేసేలా ప్రణాళిక రూపొందిస్తుంది. దీనిద్వారా పరిశ్రమల్లో ఖాళీలు భర్తీ కావడంతోపాటు విద్యార్థులకు ఉద్యోగాలు దక్కుతాయి. అలాగే పరిశ్రమల్లో ఖాళీలు భర్తీ చేసినందుకు గాను ఆయా పరిశ్రమలు సీఎస్ఆర్ పథకం కింద ఐటీఐ కళాశాలలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాయి. అలాగే పరిశ్రమల్లో అవసరమైన అర్హతలు కలిగిన ఉద్యోగి ఐటీఐల్లో లేకపోతే.. అలాంటి విభాగాల్లో ప్రత్యేకంగా ఐటీఐలో శిక్షణ అందించి ఆయా ఖాళీలను భర్తీ చేసే బాధ్యతను ఐటీఐలు తీసుకుంటాయి. దీని ద్వారా ఐటీఐతో విద్యార్థులకు మంచి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ టీ–గేట్ పనిచేస్తోంది. నగరంలోని ఏటీసీ కేంద్రంలో విద్యార్థులకు ఉపయోగపడే కోర్సులకు సంబంధించిన సామగ్రి అంతా చేరడంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

కొనసాగుతున్న ప్రవేశాలు

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏడు కోర్సులు ఉండగా... వీటిలో కోర్సు ఆధారంగా విద్యార్థుల ప్రవేశాలు ఉంటున్నాయి. అన్ని కోర్సులకు సంబంధించి 172 సీట్లకు గాను 166 భర్తీ అయ్యాయి. ఇక ఏటీసీలో గత ఏడాది 172సీట్లకు గాను అన్నీ భర్తీ అయ్యాయి. ఈ విద్యా సంవత్సరంలో 172 సీట్లకు 165 సీట్లు ఇప్పటికే భర్తీ అయ్యాయి.

కొత్తగా వాక్ ఇన్ అడ్మిషన్

ఐటీఐల్లో ప్రవేశాల ప్రక్రియ రెండో దశ ముగిసింది. కొత్తగా వాక్ ఇన్ అడ్మిషన్ పేరుతో ప్రవేశాలు కల్పించేందుకు నిర్ణయించారు. ఈమేరకు అర్హత కలిగిన అభ్యర్థులు 28వ తేదీ వరకు ప్రతిరోజు 11 గంటల్లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని కళాశాలల్లో దరఖాస్తు ఫారంతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లు సమర్పిస్తే పరిశీలించి ఖాళీల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

ప్రవేశాలకు ముమ్మర ప్రయత్నాలు

ఇటీవలటీ–గేట్ బృందం ప్రవేశాల పెంపు, కావాల్సిన సౌకర్యాలు, ఉపాధి అవకాశాలపై సమీక్ష నిర్వహించింది. ఇందులో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి ఆయా అంశాలను వివరించారు. ఇదిలా ఉండగా కలెక్టర్ అనుదీప్ ఇటీవల ఐటీఐని సందర్శించి పలు సూచనలు చేశారు. అంతకు ముందు కలెక్టరేట్, కేఎంసీల్లో అదనపు కలెక్టర్ శ్రీజ ఐటీఐల్లో ప్రవేశాల పెంపునకు అధికారులతో చర్చించారు.

మెరుగైన ఉపాధి అవకాశాలు



ఐటీఐ విద్యను అభ్యసించడం వల్ల విద్యార్థులకు చదువుతోపాటే ఉపాధి అవకాశాలు లభించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు విద్యను అభ్యసించి ఉపాధి అవకాశాలు చూపించగా.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం టీ–గేట్ ఏర్పాటు చేసింది. దీనివల్ల విద్య, ఉపాధితోపాటు కళాశాలలో అవసరమైన సదుపాయాలు సైతం సమకూరడంతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభించనున్నాయి.

– ఎ.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ, టీ–గేట్ కన్వీనర్

కేఎంసీలో ఏజీ ఆడిట్ పొడిగింపు

- మరో మూడు రోజులు కొనసాగింపు..
- రికార్డులు ఇవ్వకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం
- లైజనింగ్ అధికారిని కేటాయించినా స్పందన కరువు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) కార్యాలయంలో జరుగుతున్న అకౌంట్స్ జనరల్ (ఏజీ) ఆడిట్‌ను అధికారులు మరో మూడు రోజుల పాటు పొడిగించినట్లు తెలిసింది. జూలై మూడో వారం నుంచి ప్రారంభమైన ఏజీ ఆడిట్ ఈ నెల 21వ తేదీతో పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ, సంబంధిత అధికారుల తీరుతో ఆడిట్ బృందం అసంతృప్తి వ్యక్తం చేస్తూ గడువు పెంచినట్లు సమాచారం. సాధారణ ఆడిట్ ఏడాదికోసారి జరగనుండగా.. ఏజీ ఆడిట్‌ను రాష్ట్ర అధికారులు రెండు మూడేళ్లకోమారు చేపడతారు. ఈ ఆడిట్ సమయంలో ఆయా శాఖల కార్యాలయాల అధికారులు తమ రికార్డులన్నింటినీ ఆడిట్ చేయించాల్సి ఉంటుంది. రెండు మూడేళ్ల తర్వాత కేఎంసీలో జూలై మూడో వారంలో ఏజీ ఆడిట్ అధికారులు ఆడిట్‌ను ప్రారంభించారు.

ముందుగానే సమాచారం ఇచ్చినా..

ఏజీ ఆడిట్ ప్రారంభానికి ముందే కేఎంసీ కమిషనర్‌కు ఆడిట్ అధికారులు సమాచారం అందజేశారు. తమకు అందించాల్సిన రికార్డులను అందుబాటులో ఉంచాలని సూచించారు. దీంతో కేఎంసీ కమిషనర్ ఆడిట్ అధికారులకు సహకరించేలా అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి మరీ సూచనలు చేయడంతో పాటు సమన్వయం చేసేందుకు కార్యాలయ మేనేజర్‌ను లైజనింగ్ అధికారిగా నియమించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. కమిషనర్ ఆదేశాలను, ఆడిట్ అధికారుల సూచనలను కేఎంసీ అధికారులు, లైజనింగ్ అధికారి పట్టించుకున్నట్లు లేదు. దీంతో వారు పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలించలేదని తెలుస్తోంది. ఒకటి రెండు విభాగాల అధికారులు ఇంత వరకు ఆడిట్ అధికారులకు తమ విభాగాలకు సంబంధించిన రికార్డులను సమర్పించలేదనే చర్చ కేఎంసీలో ఉంది. ఆడిట్ ప్రక్రియలో అవసరమైన పత్రాలు, ఖాతాల వివరాలు సమయానికి అందజేయడంలో కేఎంసీ అధికారులు ఆలస్యం చేసినట్లు తెలుస్తోంది. ఈ కారణంగా ఇప్పటికే సేకరించిన రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించడంతో పాటు తాము అడిగిన రికార్డులను తీసుకొని పరిశీలించేందుకు అధికారులు మరో మూడు రోజులు గడువు పొడిగించారని సమాచారం.

ఆర్థిక లావాదేవీలపై దృష్టి..

కొన్నేళ్లుగా మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ బృందం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. నిధుల వినియోగం, వ్యయ కేటాయింపులు, టెండర్ల ప్రక్రియ వంటి అంశాలను ఒక్కొక్కటిగా విశ్లేషిస్తూ అనుమానాస్పద వ్యయాలపై స్పష్టత కోరినట్లు సమాచారం. ఇక కేఎంసీకి ప్రధాన ఆదాయవనరుగా ఉన్న రెవెన్యూ విభాగం (ఆస్తి పన్నుల వసూళ్లు) నుంచి అధికారులు ఆడిట్ బృందానికి ఇంతవరకు రికార్డులు అప్పగించలేదనే చర్చ ఆ విభాగంలోనే జరుగుతోంది. తాను కొత్తగా వచ్చానని, తనకు రికార్డులు ఎక్కడ ఉన్నాయో తెలియదని సదరు విభాగ అధికారి తోటి ఉద్యోగులతో చర్చిస్తున్నట్లు తెలిసింది. రెవెన్యూ విభాగానికి సంబంధించిన రికార్డులను ఇవ్వకపోవడంపై ఆడిట్ బృందంలోని అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు కూడా చర్చ జరుగుతోంది.

మూడు రోజుల పాటు..

సాధారణంగా ఏ శాఖలో ఏజీ ఆడిట్ జరిగినా వారు నిర్దేశిత ప్రణాళిక ప్రకారం.. కేటాయించిన షెడ్యూల్ తేదీల్లోనే ఆడిట్‌ను పూర్తి చేస్తుంటారు. గతంలో కేఎంసీలో జరిగిన ఏజీ ఆడిట్‌ల సమయంలో కూడా వారు నిర్ణయించిన తేదీల్లోనే ఆడిట్‌ను ముగించుకొని వెళ్లారు. కానీ, ఈ సారి అందుకు విరుద్ధంగా ఆడిట్‌ను మరో మూడు రోజులు పొడిగించారు. కేఎంసీ అధికారులు సహకరించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం.

ఉన్నత ప్రమాణాలతో క్రికెట్ పిచ్‌లు

జీళ్లచెర్వులో త్వరలో అందుబాటులోకి..



మాట్లాడుతున్న ఎండీ మసూద్‌పాషా

ఖమ్మంస్పోర్ట్స్: కూసుమంచి మండలం జీళ్లచెర్వు పరిధిలోని అగ్రహారంలో ఖమ్మం జిల్లా క్రికెట్ అసో సియేషన్ ఆధ్వర్యంలో రెండు క్రికెట్ పిచ్‌లను అందుబాటులోకి తీసుకొస్తున్నామని సంఘం కార్య దర్శి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కోఆర్డినేటర్ ఎండీ మసూద్‌పాషా తెలిపారు. ఆదివారం నగరంలోని సీక్వెల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీళ్లచెర్వులో 14 ఏకరాల స్థలంలో క్రికెట్ మైదానంతోపాటు బీసీసీఐ ప్రమాణాలతో రెండు క్రికెట్ పిచ్‌లను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఒక్క పిచ్‌ను జిల్లా, రాష్ట్రస్థాయి టోర్నమెంట్లు ఆడే విధంగా సిద్ధం చేస్తున్నామని, మరో పిచ్‌లో ప్రాక్టీస్ చేసుకునేందుకు తీర్చిదిద్దుతున్నామన్నారు. పనులు త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నగరంలో క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు నడుంబిగించామని తెలిపారు. నిధులు దుర్వినియోగం జరిగినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, క్రికెట్ అభివృద్ధికి తనవంతు సాయం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని వివరించారు. ఎస్.కె.గయాజ్‌పాషా, బి.సందీప్, ఫారుఖ్, యాకూబ్, ఆసిఫ్, మల్సూర్, క్రికెటర్ల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపులో బీసీలదే కీలక పాత్ర



అభివాదం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

సత్తుపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బీసీలు కీలక భూమిక పోషించారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ సమాజాన్ని మోసం చేసిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. ఆదివారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్‌తో కలిసి వీరబాబు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం చేస్తున్న పోరాటాన్ని బీసీ సమాజం మరిచిపోదన్నారు. అనంతరం వీరబాబును బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మల్లెలి శ్రీనివాస్, మరీదు ప్రసాద్, వీరివాడ నాగభూషణం, సుధాకర్, వెంకటేశ్వర్లు, రంగారావు, నాంచారి, గౌతమ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి

కామేపల్లి: విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. ముచ్చర్ల గ్రామానికి చెందిన బత్తుల ఐలయ్య, బాడీశా మల్లయ్యకు చెందిన ఆవులు పంట చేల సమీపంలో మేతకు వెళ్లిన సమయంలో అప్పటికే తెగి పడి ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లను తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కో ఆవు విలువ రూ.80 వేలు ఉంటుందని, విద్యుత్ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు వేడుకున్నారు.

సురవరం.. ఓ విప్లవోద్యమ కెరటం..



నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఖమ్మంమయూరిసెంటర్: ఓ తరం విప్లవోద్యమ కెరటం సురవరం సుధాకర్‌రెడ్డి అని, ఆయన మరణంతో మార్క్సిస్ట్ మేధావిని కోల్పోయామని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థి దశ నుంచే సురవరంతో కలిసి పనిచేశానని, ఆ తర్వాత ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర బాధ్యతలను సుధాకర్‌రెడ్డి స్వీకరించారని చెప్పారు. ఆరు దశాబ్దాల పాటు కలిసి పనిచేశామని తన జీవితాన్ని పోరాట చరిత్రగా మార్చుకున్న ఘనుడు ఆయన అని కొనియాడారు.

సుధాకర్ రెడ్డికి నివాళులు..

సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి పార్థివదేహానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి నివాళులర్పించారు. వారితో పాటు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, పీసీసీ సభ్యులు వడ్డే నారాయణరావు, పుచ్చకాయల వీరభద్రం తదితరులు ఉన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఆనాటి విద్యార్థులు

ఖమ్మంలీగల్: ఖమ్మంలోని ఆర్ట్స్, సైన్స్ కాలేజీలో 1972 – 1975 బ్యాచ్ బీఎస్సీ (బీజెడ్సీ) విద్యార్థులు ఆదివారం నగరంలోని ఓ హోటల్ లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మొత్తం 27 మంది పూర్వ విద్యార్థులు తమ కుటుంబాలతో కలిసి పాల్గొన్నారు. పాత జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఖమ్మంలో నివసిస్తున్న యరమల్ల సుదర్శన్‌రావు (రిటైర్డ్ మేనేజర్), ఆళ్ల వెంకట్రావు (రిటైర్డ్ పారా మెడికల్ ఆఫీసర్), బండి సత్యనారాయణ (రిటైర్డ్ జ్యుడీషియల్ ఆఫీసర్), లక్ష్మణ్‌రావు (రిటైర్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్), చి.రామారావు, డి.వెంకటేశ్వ ర్లు, డి.సుధాకర్ పాల్గొన్నారు.

రోటొవేటర్ కిందపడి బాలుడి దుర్మరణం

కూసుమంచి: మండలంలోని లోక్యాతండా శివారు కొత్తతండాలో రోటొవేటర్ కిందపడి ఓ బాలుడు దుర్మ రణం చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. తండాకు చెందిన వడిత్యారాంబాబు తనట్రాక్టర్ రోటొ వేటర్‌తో దుక్కి దున్నేందుకు వెళ్లాడు. అతడి ఆరేళ్ల కుమారుడు భువనేశ్వర్‌ను ట్రాక్టర్‌పై ఎక్కించుకుని దుక్కిదున్నుతుండగా బాలుడు ప్రమాదవశాత్తు రోటొవేటర్ కింద పడి మృతిచెందాడు. కళ్ల ముందే కన్న కొడుకు మృతిచెందటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

భార్యపై అనుమానంతో భర్త దాడి

మధిర: భార్యపై అనుమానంతో భర్త దాడి చేసిన ఘటన శనివారం రాత్రి మాటూరు గ్రామంలో చోటుచేసుకుంది. మాటూరు బీసీకాలనీలో నివసిస్తున్న సూర్యనారాయణ లారీడ్రైవర్‌గా పనిచేస్తుండగా భార్య సాయి నాగలక్ష్మి కూలి పనులకు వెళ్తోంది. ఇటీవల కాలంలో దంపతుల మధ్య మనస్పర్ధలు చోటుచేసుకుంటున్నాయి. శనివారం రాత్రి ఇంట్లో ఉన్న కత్తితో విచక్షణా రహితంగా నాగలక్ష్మిపై దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారికి ఇద్దరు కుమారులు కాగా ప్రస్తుతం నాగలక్ష్మి గర్భవతి అని తెలిసింది. గతంలో కూడా భార్యపై సూర్యనారాయణ దాడి చేసి గాయపరచగా మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి ఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై భార్య దాడి



గాయపడిన గంగారాం

పెనుబల్లి: తాగుడుకు బానిసైన భర్త తరచూ గొడవ పడుతున్నాడని.. భర్తకు నోట్లో గుడ్డలు కుక్కి భార్య తీవ్రంగా గాయపర్చిన ఘట న పెనుబల్లి మండలంలోని వీఎం బంజర్ బేడాబుడగజంగం కాలనీలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. కాలనీలో పర్వతం గంగారాం, లక్ష్మీ దంపతులు నివాసం ఉంటు న్నారు. గంగా రాం తాగుడుగు బానిసై భార్యను కొడుతున్నాడు. రెండు రోజుల కిందట లక్ష్మి తనకు దెయ్యం పట్టిందని కేకలు వేస్తూ భర్త పడుకున్న సమయంలో నోట్లో గుట్టలు కుక్కి చితకబాదింది. గాయపడిన గంగారాంను బంధువులు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.వెంకటేశ్ తెలిపారు.

రాజీవ్ స్వగృహ ఇళ్లు వేలం

- 18 ఏళ్ల క్రితం రాజీవ్ స్వగృహ ఇళ్ల నిర్మాణం
- చివరి దశలో ఆగిన పనులు
- వేలంలో విక్రయించాలని ప్రభుత్వ నిర్ణయం



రాజీవ్ స్వగృహ ఇళ్ల సముదాయం



బిల్డర్లతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ అనుదీప్ (ఫైల్)

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లి పరిధిలో దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2007లో మధ్యతరగతి ప్రభుత్వ ఉద్యోగుల కోసం 9.22 ఎకరాల్లో రాజీవ్ గృహకల్ప నిర్మించారు. బహుళ అంతస్తుల భవనాలు, ఎనిమిది బ్లాకులు, తొమ్మిది ఫ్లోర్లు, ఒక్కో ఫ్లోర్‌కు 8 ఫ్లాట్లు ఉన్నాయి. మొత్తం మీద 576 ఫ్లాట్లతో రాజీవ్ స్వగృహ ఇళ్లను నిర్మించారు. అప్పటి ప్రభుత్వం ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ఇళ్ల నిర్మాణ బాధ్యతను కట్టబెట్టింది. సదరు కాంట్రాక్టర్లు ఇళ్లకు స్లాబులు వేసి, ప్లాస్టరింగ్ చేసి వదిలి వేశారు. ఇక అప్పటి నుంచి అవి ఖాళీగానే ఉంటున్నాయి. ఇళ్ల నిర్మాణం కంటే ముందు మధ్యతరగతి ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్లు కేటాయించాలని నిర్ణయించి అర్హులైన వారి నుంచి రూ.3 వేలు చొప్పున డిపాజిట్ తీసుకున్నారు. ఇక 15 ఏళ్లుగా డిపాజిట్ చేసిన ఉద్యోగులు ఇళ్ల కేటాయింపు కోసం ఎదురుచూశారు. అనంతరం తమకే ఇళ్లు కేటాయించాలని అప్పట్లో పెద్దఎత్తున ఆందోళన చేశారు. దీంతో అప్పటి ప్రభుత్వం డిపాజిట్ చేసిన సొమ్మును తిరిగి వారికి చెల్లించింది.

వేలంలో విక్రయం..

రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం ద్వారా విక్రయించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. డిపాజిట్ చేసిన రూ.3వేలు తిరిగి తీసుకెళ్లాలని, ఇళ్లను కొత్తగా వేలం వేసి విక్రయిస్తున్నట్లు తెలిపింది. ఆమేరకు డిపాజిట్లు వెనక్కి ఇచ్చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం వచ్చీ రాగానే సీఎం రేవంత్‌రెడ్డి కూడా రాజీవ్‌స్వగృహ ఇళ్లను వేలం ద్వారా విక్రయిచి, వచ్చే సొమ్మును ప్రభుత్వాదాయానికి సమకూర్చుకోవాలని నిర్ణయించింది. త్వరలోనే స్వగృహ ఇళ్లను వేలం ద్వారా విక్రయించనున్నారు.

ఏర్పాట్లలో అధికారులు..

ఇదిలా ఉండగా స్వగృహ ఇళ్ల సముదాయాన్ని ఈ నెల మొదటి వారంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ సందర్శించారు. నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే స్వగృహకు వెళ్లడానికి ఖమ్మం వరంగల్ ప్రధాన రహదారి నుంచి స్వగృహ వరకు 60అడుగుల అప్రోచ్ రోడ్ మంజూరు చేసి వెంటనే పనులను కూడా ప్రారంభించారు. స్వగృహ ఇళ్లకు రక్షణగా మున్నేరు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నందున బఫర్ జోన్ కూడా వర్తించదని, అదనంగా సౌకర్యాలు కూడా కల్పిస్తామని సదరు బిల్డర్లకు, కొనుగోలుదారులకు హామీ ఇచ్చారు. అదనంగా క్లబ్ హౌస్, ఓపెన్ ఎయిర్ థియేటర్, స్విమ్మింగ్ పూల్, 24 గంటల సెక్యూరిటీ, వాకింగ్ ట్రాక్ వంటి సౌకర్యాలతో పాటు సురక్షిత, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉద్యోగుల కుటుంబాలు నివసించే విధంగా తీర్చిదిద్దనున్నారు. రాష్ట్ర ఉద్యోగులతో పాటు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నాలుగో తరగతి ఉద్యోగులు, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, జెన్‌కో, సింగరేణి, కేటీపీఎస్, బ్యాంకింగ్, ఎఫ్‌సీఐ, ఎల్ఐసీ ఉద్యోగులతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా కొనుగోలు చేసుకోవడానికి అవకాశం కల్పించనున్నారు. కాగా, 150కి పైగా ఫ్లాట్స్ కొనుగోలు కోసం వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు రిజిస్టర్ చేసుకున్నారు.

అన్ని వసతులు ఉంటాయి

స్వగృహలో చదరపు అడుగు ధర రూ.1,150 మాత్రమే. ముఖ్యంగా వివిధ సంస్థలో పని చేసే ఉద్యోగులకు మేలు చేకూర్చాలన్న లక్ష్యంతో నిర్మాణానికి అయిన ఖర్చు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటూ ఇంత తక్కువ ధరలో ఇవ్వాలని నిర్ణయించాం. బిల్డర్లు, డెవలపర్లు, జాయింట్ వెంచర్లు, ఇలా గ్రూప్ హౌసింగ్ పథకాలపై ఆసక్తి ఉన్న వారు ఎవరైనా ఇందు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై 22న నోటిఫికేషన్ విడుదల చేసి, సెప్టెంబర్ 8న లాటరీ విధానంలో కేటాయించనున్నాం. స్వగృహలో అన్ని సౌకర్యాలు ఉంటాయి.

–వీపీ గౌతమ్, స్వగృహ ఎండీ